
## ◆ఈవారం కథ

# మళ్ళీ తల్లి ఒడిలోకి

కాలువ మల్లయ్య



"ప్రభుత్వం చాలా స్ట్రిక్టుగుంది ... నష్టాల్లో నడుస్తున్న పరిశ్రమలను మూసివేయడమో, ప్రైవేటీకరణ చేయడమో తప్పదు.. `అందులో భాగంగానే మన ఫ్యాక్టరీ మూతపడక తప్పేట్టు లేదు... మనమంతా మానసికంగా సిద్ధం కావాలి..."

అన్నాడు రఘువర్మ అతి మామూలుగా ...

రఘువర్మ ట్రేడ్ యూనియన్ నాయకుడు.

దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల్లోంచి వచ్చిన వాళ్ళు పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలోని కర్మాగారం ఉద్యోగుల కోసం కట్టించిన టౌన్షిప్ అది. 'మినీ ఇండియా'గా పిలువబడే 'ఫెర్టిలైజర్ సిటీ' షాపింగ్ సెంటర్ దగ్గరున్న చెట్లకింద చాలామంది ఉద్యోగులు కూర్చొని మాట్లాడుకుంటున్నారు.

రఘువర్మ అన్న మాటల్లోని సారాంశం వచ్చే మాటలు గత కొద్ది నెలలుగా రోజూ వింటున్నవే అయినా, వార్తాపత్రికల్లో చదువుతున్నవే అయినా అక్కడున్న వాళ్ళందరికీ ఆ మాటలు వేదనను కల్గించాయి... అదేదో శుభవార్తయినట్టు చెప్పిన అతని మాటతీరు కోపం తెప్పించాయి... గత కొన్ని నెలలుగా ఆందోళనతో, అనిశ్చిత స్థితితో, భవిష్యత్తుపై భయంతో గడుపుతున్న వాళ్ళకా మాటలు ఆవేదనను కల్గించాయి.

"ఫ్యాక్టరీ మూతపడ్డా నీలాంటివాడికి నష్టమేంటి? మీలాంటి వాళ్ళకు మూతపడాలనే వుంది. ఇక్కడ కాకుంటే మరో చోట లీడర్షిప్ దుకాణం తెరుస్తారు. అయినా మీకా అవసరం లేదులే. ఇది వరకే లక్షలు సంపాదించుకొన్నారు. ఫ్యాక్టరీ పోతే మాలాంటి వాళ్ళే డవాలి..." అన్నాడుశంకరయ్య. అతడా ఫ్యాక్టరీలో కార్మికుడు.

"శంకరయ్యన్న మాట నిజమే... లీడర్లందరు బందవస్తుగున్నరు ... మూతపడ్డా వాళ్ళకేం 'ఫరకు' పడదు..."

స్టెనోగ్రాఫర్గా పనిచేస్తున్న కనకయ్య అన్న మాటలను మరో ఇద్దరు బలపరిచారు.

"నేనేమన్నానని నా మీదికి విరుచుకుపడ్తున్నారు? నాకెందుకు ఫ్యాక్టరీ మూతపడాలనుంటుంది? ఫ్యాక్టరీ మూతపడితే నేను చేసే లీడర్షిప్ ఎక్కడ? కాలం మంచిగ లేదు ... ఇక్కన్నుంచి వెళ్ళిపోవడమే మంచిది" అని లేచి నడవసాగాడు రఘువర్మ.

'జోక్ చేశాం రావోయ్...' అని పిలుస్తున్నా వినిపించుకోకుండా అతడు గబగబా వెళ్ళిపోయాడు.

"మనవాడికి కోపమొచ్చినట్టుంది పాపం..." అన్నాడు సూర్యారావు.

"వస్తే వచ్చిందిలే ... వున్న మాటంటే వులుకే..." అన్నాడు ఆపరేటర్ ఆనందం.

"పదిహేను, ఇరవై ఏళ్ళుగా హాయిగా కాలం గడుపుతున్నాం... ఫ్యాక్టరీ మూతపడితే మనమంతా రోడ్డుమీద పడాల్సిందే..."

"పిల్లలకు ఫ్రీ ఎడ్యుకేషన్, మెడికల్ ఫెసిలిటీ, నామమాత్రపు రెంటుతో అన్ని వసతులున్న క్వార్టర్, మంచి జీతం ... ఇవన్నీ ఎక్కడ దొరకాలి? మన ఉద్యోగాలు పోతే పూలమ్మిన చోటే కట్టెలమ్ము కోవాల్సిన పరిస్థితొస్తుంది..."

"అందరూ పెద్దగా కూడబెట్టకపోయినా, ఆర్థికంగా పెద్దగా ఇబ్బందులు లేకుండా గడుస్తుంది కాలం. ఫ్యాక్టరీ మూతపడితే మన బ్రతుకులు అల్లకల్లోల మవుతాయి."

"డిగ్రీలు, పి.జి.లున్న వాళ్ళకు కొంత నయం. మనలాంటి వాళ్ళకే కష్టం" అన్నాడు శంకర్.

"ఆం... అక్కడుద్యోగాలు మన కోసం ఖాళీగుంచారు తియ్యి. ఈ రోజుల్లో ఉద్యోగం దొరకాలంటే మాటలు కాదు. పి.జి.లు, పి.హెచ్డి.లు చేసి ఎంతోమంది ఖాళీగున్నారు. ఉన్న ఉద్యోగం పోతే ఎవరికైనా కష్టమే. కొంచెం ఎక్కువ తక్కువ అంతే" అన్నాడు స్టెనోగ్రాఫర కనకయ్య.

"క్వాలిఫికేషన్నున్నా ఏజ్ ప్రాబ్లమ్ ... మొదట్లో


ట్రెయినీలుగా జాయినయిన వాళ్ళు, డిగ్రీలు చేసి జాయినయిన వాళ్ళు చాలామంది నలభై ఏళ్ళ దరిదాపుల్లో వున్నారు. ఈ వయసు వాళ్ళే మన ఫ్యాక్టరీలో ఎక్కువ మందున్నారు. ఏ క్వాలిఫికేషనున్నా ఈ వయసులో ఏ ఉద్యోగం దొరుకుతుంది? " అన్నాడు మనోహర్.

"నిజమే... మనకు చావుకే వచ్చింది."

"నష్టాలకు మనమెంతవరకు బాధ్యులం..? ఉద్యోగులను బలి పశువులను చేయడమేం బాగుంది..?' '

"నష్టాలకు బాధ్యులెవరైనా ఎప్పుడో ఒకప్పుడు కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు.. అదిప్పుడు తీసుకుంటున్నారు. దీనివల్ల కొందరు నష్టపోక తప్పదు."

"తీరిపారి బాగానే మాట్లాడుతున్నావు? రోడ్డు మీద నిలబడితే అప్పుడు తెలుస్తుంది. నూతన పారిశ్రామిక విధానమేమో కాని మన చావు కొచ్చింది. ముప్పై ఏళ్ళలోపు యువకుల సంగతి సరే... కిందా మీదా పడి ఏదో విధంగా బ్రతుకుతారు. ఏభై ఏళ్ళు దాటిన వాళ్ళు వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకోవడం వల్ల వాళ్ళకు మిగిలిన జీతంలో చాలావరకొస్తుంది... వాళ్ళు నష్టపోయేది చాలా తక్కువే .. ఎటొచ్చీ ఎటూ కాకుండా పోయేది, రెంటికి చెడ్డ రేవళ్ళయ్యేది మధ్య వయసు వాళ్ళే... ఓ దిక్కు ఎదుగుతున్న పిల్లలు... పెరుగుతున్న ఖర్చులు ... బాధ్యతలు ... ఉద్యోగాలు పోతే మనగతేం కావాలి?" దాదాపేడుస్తున్నట్టుగా అన్నాడు శంభులింగం.



"ఏం శంభులింగం... నువ్వింత బెంబేలు పడుతున్నావెందుకు చెప్పు.." అని అతని భుజ మీ్మద చెయ్యేశాడు ప్రసాదరావు.

"ఇగో బై ... నాకైతే ఫ్యాక్టరీ బందు కావన్ననే వుంది ... బందైతే ఎవ్వల కెపాసిటేందో తెలుస్తది... నేను వేరే ఉద్దేశ్యంతో నంటన్ననుకోకుండ్రి ... మనకు కండ్లు నెత్తిమీది కచ్చినయి .. మనమంతా కార్మికులమేనా? మనం బయట పెట్టుబడిదారుని లెక్కనే ప్రవర్తిస్తున్నం. కార్మికులమై వుండీ కార్మికుల వని చెప్పుకోవడం మనకు మోటు. మన ఇంటికి గోచులు పెట్టుకొని, ధోతులు గట్టుకొని మన అవ్వయ్యలస్తె మనకు మోటు ... మోటు కష్టం జేసుకునే సుట్టాలత్తె మోటు ... మనలో చాలామంది పల్లెటూళ్ళ నుంచొచ్చినా పల్లెలంటె మనకు పడది ... తల్లిపాలు చీకి రొమ్ము గుద్దే వాళ్ళలాగ తయారైనం మనం చాలామందిమి" అన్నాడు సీనియర్ ఆపరేటర్ నర్సింహులు.

"అవును... నర్సింహులు చెప్పింది నిజమే... మన దాంట్లెంతో మంది నౌకరి కాగానే తల్లిదండ్రులను కూడా దూరం చేసుకున్నారు... కన్ను మిన్ను కానకుండా ప్రవర్తించిండ్రు ... ఇప్పుడు తెలుస్తదొక్కొక్కల సంగతి..." అన్నాడు రాజయ్య...

□□□□

బెడ్‌రూంలో కెళ్ళి డ్రెస్ మార్చుకున్నాడు కిషన్. మంచంలో వెల్లకిలా పడుకున్నాడు.. పిల్లలు స్కూలుకెళ్ళారు. అతని భార్య అరుణ వంటపనిలో నిమగ్నమై వుంది. తిరుగుతున్న ఫ్యాన్‌కేసి చూస్తున్న కిషన్‌లో ఎన్నో ఆలోచనలు ....

ఫ్యాక్టరీ మూత గురించి వింటున్న మాటలు, నర్సింహులన్న మాటలు అతని చెవుల్లో గింగురమంటున్నాయి.

□□□□

తాను మధ్యతరగతి వ్యావసాయిక కుటుంబంలో పుట్టాడు ... మట్టిలో మట్టై బ్రతికే భూమి పుత్రుడికి కొడుకుగా పుట్టాడు. పల్లెటూళ్ళోనే పెరిగాడు. తాము పదవతరగతి పాసై ఇంటర్‌లో చేరిన సంవత్సరమే ఫెర్టిలైజర్ కంపెనీలో క్రాఫ్ట్సమన్ ట్రెయినీగా ఉద్యోగం కొరకు పిలుపొచ్చింది. అందులో తాను సెలెక్టయ్యాడు.. మూడేండ్ల ట్రెయినింగ్ తర్వాత జూనియర్ టెక్నీషియన్‌గా ఉద్యోగమొచ్చింది.. తర్వాత పెళ్ళయింది. ఓ మోస్తరు జీతం ... ఓవర్‌టైమ్ ... వసతులు... సదుపాయాలు ... జీవితం సాఫీగానే జరిగిపోతుంది.

క్రమక్రమంగా తానే మట్టి నుంచైతే వచ్చాడో ఆ మట్టికే దూరం కావడం ప్రారంభమైంది. తనకు, తన భార్యకు తన కన్న తల్లిదండ్రులే మట్టిమనుషులుగా కనబడడం మొదలైంది. తెల్లబట్టలతో నాగరికులుగా వుండే తాము వాళ్ళకంటె భిన్నమైన వాళ్ళమనుకున్నారు. క్రమక్రమంగా తాను వాళ్ళకు దూరమయ్యాడు. ఊరికే దూరమయ్యాడు. మొరటుగా వుండే తల్లిదండ్రులు తమ ఇంటి కొస్తే మోటుగా భావించారు తాము. వాళ్ళతో సంబంధాలను తెగదెంపులు చేసుకున్నాడు తాను... తనకున్న ఉద్యోగం చూసుకొని విర్రవీగాడు. ఊళ్ళో తనకున్న భూమి అక్కర్లేదన్నాడు. తన భార్యా అలాగే ప్రవర్తించింది. ఈ ఉద్యోగం, ఈ జీవితం, స్కూటర్లు ఇవే శాశ్వతమనుకున్నారు! కొన్నేళ్ళుగా తల్లిదండ్రులు తన దగ్గరకు రావడం లేదు. తాను మాత్రం అప్పడప్పుడు చుట్టపు చూపుగా పోయొస్తున్నాడు. తనకీ పరిస్థితి రాబోతుందని తాను కలలో కూడా వూహించలేదు.

ఒకవేళ ఫ్యాక్టరీ మూతపడి తన ఉద్యోగం పోతే ఏం చేయాలి?

నలభై ఏళ్ళ దరిదాపుల కొస్తున్న తనకు, ఏ క్వాలిఫికేషనూ లేని తనకు ఉద్యోగం దొరకడం కష్టం. టెక్నీషియన్‌గా ఏదైనా స్వంతపని చేసుకుందామన్నా, తానేమంత నిపుణుడైన వాడు కాదు. తనకు పెద్దగా పనిరాకున్నా ప్రభుత్వ ఫ్యాక్టరీలో కాబట్టి సరిపోయింది... మంత్రాల బలం లేకున్నా తుంపుర్ల బలంతో ఇన్నేళ్ళుగా నెట్టుకొచ్చాడు..

మరిప్పుడు తానేం చేయాలి? ఎక్కడ పని వెతుక్కోవాలి...? ముందు తానెక్కడుండాలి? ఉద్యోగం లేకుండా తాను డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్ లాంటి ప్రదేశంలో వుండగలడా?

రకరకాలుగా తనను తానే ప్రశ్నించుకుంటున్నాడు కిషన్. బ్రతుకు భయంతో తల్లడిల్లిపోతున్నాడు. భవిష్యత్తును గురించి ఆలోచిస్తూ వణికిపోతున్నాడు. దాదాపన్నిండ్లలోనూ జరుగుతున్న సంఘర్షణను జ్ఞాపకం తెచ్చుకొని భయ

పడుతున్నాడు.

బెల్ చప్పుడు విని మంచంలోంచి లేచి ముందు గదిలో కొచ్చాడు. తలుపు తీసి ఎదురుగా నిల్చొనున్న తండ్రిని చూసి ఆశ్చర్యంలో నోరెళ్ళబెట్టాడు కిషన్... కొద్ది క్షణాలాగి

"రాయే నాయిన్న! లోపలికి రా..." అని తండ్రిని గదిలోకి తీసుకొచ్చాడు.

చేతిలో వున్న సంచిని టీపాయ్‌పై పెట్టి లోపలికెళ్ళాడు కిషన్ తండ్రి కొంరయ్య. కాళ్ళు చేతులు కడుక్కొని వచ్చి ముందు గదిలో వున్న కుర్చీలో కూర్చున్నాడు.. తండ్రి ప్రక్కనున్న మరో కుర్చీలో కూర్చున్నాడు కిషన్... పని పూర్తి చేసుకున్న అరుణ వచ్చి భర్త సమీపంలో నిల్చుంది.

"అవ్వ మంచి గుందానె..?" అడిగాడు కిషన్.

"మంచిగనే వుంది..." అన్నాడు కొంరయ్య.

కొద్ది క్షణాలెవరేం మాట్లాడలేదు.

"పిల్లలు గిట్ల బాగున్నరా బిడ్డ? బడికి పొయ్యి రాలేదా?" అన్నాడు కొంరయ్య కోడలుతో.

తాను చేసిన అవమానాలను మరిచి తనతో మాట్లాడుతున్న మామగారితో మాట్లాడటానికి న్యూనతాభావం అడ్డొస్తూంది అరుణకు ... కొద్ది క్షణాలు తటపటాయించి

"బాగనే వున్నరు ... కొద్దిసేపైతె వస్తరు..." అంది తలవంచుకొని...

కొద్దిసేపు తండ్రీ కొడుకులు ఊరి విషయాల గురించి మాట్లాడుకున్నారు.

"మీ ఫ్యాక్టరీ బందైతందని మీరంతా రంధి పడుతండ్రని విన్న. కొందరైతె ఏడ్తండ్రని విన్న.. మీ మొకాలు సూత్తెనే తెలుత్తంది మీరెంత బయపడుతండ్రో ...\ ఫ్యాక్ట్రీ బందు గాదేం గాదు... బందయిందే అనుకో ... ఎందుకు బిడ్డ గంత రంధి...? నౌకరితోనే బతుకన్నా...? మేం బతుకుత లేమా ఏంది? మనకూళ్ళె భూముండెనే వుండె ... అండ్ల బతుకరాదా ఏంది? మాతోనే మీరు బతుకుతరు ... అందరమొక్కకాన్నే బతుకచ్చు... ఏం మునిగి పోతందని గంత రంధి పడుతండ్రు... ?"

తండ్రి మాటలు వింటున్న కిషన్ ముఖంలో ఆశ్చర్యానందాలు! తాము చేసినవన్నీ మరిచి ఆపత్సమయంలో తమకండగా నిలుస్తానంటున్న మామయ్యను గౌరవ దృక్కులతో చూస్తుంది అరుణ.

తలమీద రుమాలుతో, బుర్రమీసాలతో గంభీరంగా వున్న కొంరయ్య కిషన్ కళ్ళకు ఆపద్బాంధవుడిలా అగుపడుతున్నాడు.

కొంత చదువుండీ, యువకుడై వుండీ తాను బ్రతుకు భయంతో తల్లడిల్లుతుంటే – వృద్ధుడై వున్న తన తండ్రి ఆ సమస్యకు అతి తేలికగా పరిష్కారం చెప్పిన తీరు కిషన్‌కు ఆశ్చర్యం కలిగిస్తుంది.

వ్యవసాయ కుటుంబంలోనే పుట్టి పెరిగినా – కార్మికుడిగానే పని చేస్తున్నా అవన్నీ మరిచి శ్రమకు దూరంగా, శ్రామిక మనస్తత్వానికి ఎడంగా బ్రతుకున్న కిషన్‌కు తండ్రి ధైర్యానికి గల శ్రమ మూలాలు అర్థం కావడం లేదు.

ఉద్యోగం పోయినా ఊరు తనను తల్లిఒడిలా దగ్గరకు తీసుకోబోతూందన్న హామీ తండ్రి మాటల వల్ల దొరికింది కిషన్‌కు.. అంతవరకా తని ముఖంలో వున్న విచారం మాయమైంది.

ఇంతవరకు తాను తల్లిదండ్రులతో ప్రవర్తించిన తీరుకు పశ్చాత్తాపపడుతూ, తనకు దొరికిన్లాంటి తల్లిఒడి అందరికీ దొరికితే బాగుండునని అనుకుంటూ తండ్రి పాదాలకు నమస్కరించాడు కిషన్..

